పరిగి: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్, నాయకులు

చేవెళ్లటౌన్: సంబురాలు జరుపుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

విద్యుత్ భారం ఆపిన బీఆర్ఎస్

■ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు ■ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం

పరిగి, అక్టోబర్ 30: సుమారు రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై పడకుండా బీఆర్ఎస్ పార్టీ ఆపిందని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపీపీ కరణం అరవిందరావు, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఎస్.భాస్కర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బుధవారం పరిగిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సంబురాలు జరిపారు. కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయడంతోపాటు స్వీట్లు పంచిపెట్టి, పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ.. ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేయగా, ప్రజాభిప్రాయ సేకరణలో బీఆర్ఎస్ తరపున మాజీ మంత్రులు జగదీశ్వర్ రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ మధుసూదనాచారి తమ వాదనలు వినిపించారన్నారు. ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ చేసిన వాదనల్లోని సహేతుకత, న్యాయాన్ని విని చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈఆర్‌సీ తిరస్కరించిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మంగు సంతోశ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, జంగయ్య, కౌన్సిలర్లు వారాల రవీంద్ర, నాగేశ్వర్, పీఏసీఎస్ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి, నాయకులు తాహెర్‌అలీ, బషీర్, సేవ్యానాయక్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ పోరాటంతోనే..

చేవెళ్లటౌన్: బీఆర్ఎస్ పోరాటంతోనే ప్రజలకు కరెంట్ చార్జీల పెంపు ముప్పు తప్పిందని పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, చేవెళ్ల నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలపైన రూ.18,500 కోట్ల విద్యుత్ చార్జీల భారం పడకుండా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించి అదనపు విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలను ఈఆర్సీ ఆమోదించకుండా కృషి చేసినందుకు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో పటాకులు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజల పైన ప్రభుత్వం మోపేందుకు సిద్ధమైన విద్యుత్ చార్జీల భారాన్ని ఆపడంలో బీఆర్ఎస్ విజయం సాధించిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు విద్యుత్ సంస్కరణలు తెచ్చి వెలుగు నింపితే కాంగ్రెస్ ప్రభుత్వం కోతలతో ప్రజలను ఆగం చేస్తున్నదని అరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలివితక్కువ నిర్ణయాలతో కొన్ని నెలల్లోనే రాష్ట్ర ఆదాయం తగ్గిందని విమర్శించారు. కేసీఆర్ పాలనలో కడుపు కట్టుకొని పనిచేసి వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇస్తే ఇప్పుడు కరెంట్ ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల పైన విద్యుత్ భారాన్ని ఆపడంలో ముమ్మాటికి బీఆర్ఎస్ పార్టీ విజయమేనని తెలిపారు.

కార్యక్రమంలో పామెన మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, దేవరం పల్లి మాజీ సర్పంచ్ నరహరి రెడ్డి, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు బ్యాగరి నర్సింహులు, తలారం నర్సింహులు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రామ గౌడ్, నాయకులు శేరి రాజు, దండు సత్తి, ఎల్లయ్య గని, మల్లేశ్, తోట శేఖర్, కృష్ణ తదితరులు ఉన్నారు.

ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, అక్టోబర్ 30: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రజలకు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చిరు దివ్వెలతో చీకట్లను పారదోలేది దీపావళి అని, వెలుగులు పంచే దీపావళి ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగును ఇవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. పేదలు, రైతుల జీవితాలలో వెలుగులు నింపడానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. తగు జాగ్రత్తలతో కుటుంబ సభ్యులందరూ కలిసి దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

భూగర్భ జలాల సంరక్షణపై దృష్టి సారించాలి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా భూగర్భ జల శాఖ అధికారి రవిశంకర్

వికారాబాద్, అక్టోబర్ 30: భవిష్యత్ తరాల కోసం భూగర్భ జలాల సంరక్షణపై దృష్టి సారించాలని భూగర్భ జల శాఖ జిల్లా అధికారి రవిశంకర్ తెలిపారు. బుధవారం కొత్తగడి పాఠశాలలో భూగర్భ జలశాఖ ఆధ్వర్యంలో సీడ్ స్వచ్ఛంద సంస్థ నేషనల్ హైడ్రోలజీ ప్రాజెక్ట్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు లేనందున, వ్యవసాయ రంగం భూగర్భ జలాలపై ఆధారపడి ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో భూగర్భ జలాలు పెంపొందించేందుకు రైతులు పొలాల్లో వర్షపు నీటిని ఒడిసి పట్టేందుకు నీటి కుంటల నిర్మాణం చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రధానంగా భూగర్భజలాల అదనపు వినియోగం, వృథాను నియంత్రించడానికి, ఆరుతడి పంటలను ఎంచుకొని బిందు సేద్యం పద్ధతులను పాటించాలని తెలిపారు. బోర్ వెల్ పాయింట్ కోసం రైతులు కొబ్బరికాయ పద్ధతులు అనుసరించరాదని, రైతులు భూగర్భ జల శాఖను సంప్రదిస్తే బోర్ వెల్ పాయింట్ కోసం శాస్త్రీయంగా సర్వే చేసి ఇస్తామన్నారు.

నీటి పొదుపుపై అవగాహన

ఈ కార్యక్రమానికి హాజరైన సీడ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎస్.నాగబ్రహ్మ మాట్లాడుతూ... అవగాహన కార్యక్రమాలతో విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులు, ఇతర రైతులు, మహిళలకు భూగర్భ సంరక్షణ పద్ధతులు, నీటి పొదుపు వివరాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఇందు కోసం పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. వారితో జల ప్రతిజ్ఞ చేయించామన్నారు. కార్యక్రమంలో భూగర్భ జాలశాఖ హైడ్రో జియోలాజిస్ట్ వజియుద్దీన్, డాక్టర్ కె.భాగ్య, జియోఫిసిస్ట్ వ్యవసాయ విస్తరణ అధికారి సరిత, హెచ్ఎంలు వీరకాంతం, దత్తత్రేయ, కేశవపల్లి, వికారాబాద్ ఎఫ్పీవో డైరెక్టర్లు అంజయ్య, వాళ్యా, సీడ్ స్వచ్ఛంద సిబ్బంది రవికుమార్, అమరేశ్వర చారి, మెజీషియన్ మాధవరావు పాల్గొన్నారు.

బంతిపూల కోసం..

రంగారెడ్డి, అక్టోబర్ 30 (నమస్తేతెలంగాణ) : దీపావళి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలతో పాటు ఇంటిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఇందు కోసం బంతి పూలకు భలే డిమాండ్ ఉంటుంది. బుధవారం సాయంత్ర ఇబ్రహింపట్నం సమీపంలోని గున్‌గల్ సమీపంలో బంతి పూల కోసం బారులు తీరారు. బంతిపూల తోటలో పూలు ఏరుకుంటున్న దృశ్యాలను నమస్తే తెలంగాణ తన కెమెరాలో బంధించింది.

కుటుంబ సర్వే పక్కాగా చేపట్టాలి

దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి సంధ్యారాణి

సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి సంధ్యారాణి

యాచారం, అక్టోబర్ 30: మండల పరిధిలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి, మండల ప్రత్యేకాధికారిణి సంధ్యారాణి సూచించారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో, మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలోని రైతు వేదిక భవనంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు ఎంపీడీవో నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రెండు విడుతలుగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. నవంబర్ ఒకటో తేదీ నుంచి సర్వే విజయవంతంగా చేపట్టేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని కోరారు. కుటుంబ యజమాని, సభ్యుల పూర్తి వివరాలు సేకరించాలని సూచించారు. సర్వేతో అన్ని వివరాలు తెలుస్తాయన్నారు. ప్రభుత్వం చేపట్టే పథకాలు, అభివృద్ధి ఫలాలు అందే అవకాశాలు ఉన్నాయన్నారు. సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. సర్వేను విజయవంతం చేయడానికి ఎంపీడీవో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యప్ప, సిబ్బంది ఉన్నారు.

8 గంటల పని విధానం అమలు చేయాలి

ధారూరు ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పలు సంఘాల నాయకులు

ధారూరు, అక్టోబర్ 30: అధిక పని భారం తగ్గించాలని, 8 గంటల పని విధానం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ వర్కర్లు, ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు.. ఈ సందర్భంగా మహిపాల్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ వర్కర్లు, ఆశ వర్కర్లకు సమాన పనికి సమాన వేతనం అందించాలన్నారు.. ప్రభుత్వ రంగ సంస్థల్లో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్మికులతో ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుంటున్నదని, ప్రతి సర్వే, ప్రతి పనిలో వాళ్లను ఉపయోగించుకుంటుందని, పనికి తగిన వేతనం ఇవ్వడం లేదన్నారు.. రోజురోజుకు అధికారుల వేధింపులు పెరిగిపోతున్నాయని, ప్రభుత్వం స్పందించి అందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు శారద, సుజాత, ప్రమీల, ఆశ వర్కర్ యూనియన్ అధ్యక్షురాలు కృష్ణవేణి, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు సలీం, బాలయ్య, మోతీలాల్, శ్రీశైలం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పటాకులు కాల్చే వేళ .. బహుపరాక్!

■ పండుగ పూట జాగ్రత్తలు ప్రమాదాలు జరుగకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

యాచారం, అక్టోబర్ 30: దీపావళి పండుగ పూట ఆనందంతో పటాకులు కాలుస్తూ.. చీకట్లో పండుగను వెలుగులు విరజిమ్మేలా జరుపుకొంటారు. పలు మార్లు వీటిని కాల్చే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఆ సమయంలో ఆనందం కాస్తా విషాదంగా మారుతుంది. పటాకులను కాల్చే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

చిన్నారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూయించాలని కోరుతున్నారు. ప్రస్తుతం అధునాతన నమూనా టపాకులు అందుబాటులోకి వస్తున్నాయి. ఇవి పెద్ద పెద్ద శబ్దాలు, మెరుపులు, వెలుగులతో జిగేల్ మంటూ ఆనందంలో ముంచుతాయో.. ప్రమాదాలు జరిగి విషాదం కలిగించే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం దీపావళితో పాటు విజయోత్సవ ర్యాలీలు, రాజకీయ ర్యాలీలు, జన్మదిన, వివాహ వేడుకలకు పటాకులను కాల్చడం ఆనవాయితీగా మారింది. పటాకులకు డిమాండ్ పెరగడంతో దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నిల్వ చేసిన పటాకులతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల రెండు పటాకుల దుకాణాలు దగ్ధమైన విషయం తెలిసిందే. ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాలను నివారించుకోవచ్చని సూచిస్తున్నారు.

దీపావళి రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మీ కోసం...

- పటాకులను జనావాసాలు, రద్దీగా ఉండే ప్రాంతాలు, రోడ్లపై, ఇరుగ్గా ఉన్న గల్లీలలో కాల్చరాదు.
- చెట్లు, విద్యుత్ తీగల కింద పటాకు పేల్చితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- పటాకులను ఇండ్లలో కాకుండా ఆరుబయట మాత్రమే కాల్చాలి.
- దవాఖానలు. పెట్రోల్ బంకుల సమీపంలో పటాకులు పేల్చరాదు. దీంతో భారీ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.
- పటాకులు పేల్చే సమయంలో వీలైనంత దూరంగా ఉండాలి. లేనిపక్షంలో కనుపాపలు దెబ్బతినే అవకాశం ఉంది.
- పటాకులు కాల్చేటప్పుడు వాటిపైకి వంగి చూడరాదు. అవి పేలి కాళ్లు, చేతులు, ముఖానికి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.
- చైనా కాకర్స్ పేల్చే సమయంలో ఇంట్లోకి పొగ, నిప్పురవ్వలు రాకుండా తలుపులు పెట్టుకోవాలి.
- ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్న వాళ్లు పటాకుల పేలుళ్లకు దూరంగా ఉండాలి.
- పటాకులు పేల్చుతున్న సమయంలో బకెట్‌లో నీళ్లు అందుబాటులో ఉంచుకోవాలి.
- మద్యం సేవిస్తూ టపాసులకు పేల్చరాదు. మద్యానికి మంట మండే స్వభావం ఉంటుంది.
- గాజు, లోహపు పాత్రల్లో టపాకులను పేల్చరాదు.
- – చిన్నారులు పటాకులు పేల్చుతున్న సమయంలో జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. అవసరమైతే పెద్దల సమక్షంలోనే కాల్చేలా చూడాలి.
- చిన్న పిల్లల చెవుల్లో దూది పెట్టి ఉంచితే మంచిది. భారీ శబ్దాలకు చెవి కర్ణభేరి దెబ్బతినే ప్రమాదం ఉంది.
- పేలని పటాకుల వద్దకు వెళ్లి మళ్లీ వెళ్లి చూడరాదు.
- పటాకులను వంట గదులు, పూజ గదుల్లో ఉంచరాదు. ఆయిల్ క్యాన్లు, గ్యాస్ సిలిండర్ల రెగ్యులేటర్లను ఆఫ్ చేసి పెట్టాలి.
- కండ్లకు అద్దాలు ధరిస్తే నిప్పు రవ్వలు, పటాకుల్లో ఉండే రవ్వ పడకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చు.
- ప్రతి ఒక్కరూ కాటన్ దుస్తులను ధరించి పటాకులను పేల్చడం ఉత్తమం.
- పటాకులను కాల్చడానికి పొడవాలి అగరుబత్తీలు, పొడవాటి పుల్లలను వాడి ప్రమాదం జరగకుండా అప్రమత్తగా ఉండాలి.
- పేలే పటాకులకు 5 మీటర్ల దూరం ఉండాలి.
- వీటి నుంచి వెలువడే రసాయనాలతో కండ్లకు ప్రమాదం పొంచి ఉంది. అలాంటి ఘటనలు జరిగితే చేతులతో రుద్దకుండా కండ్లను కడిగి కంటి వైద్యుడిని సంప్రదించాలి. కార్నియాకు తగిలితే చూపు పోయే అవకాశాలున్నాయి. తగిన చికిత్స చేయించాలి.
- చిచ్చుబుడ్లు, రాకెట్లతో కండ్లకు గాయాలయ్యే అవకాశం ఉంది. ఎన్నో రకాల కంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ప్రమాదవశాత్తు చేతులకు, కాళ్లకు గాయాలు అయితే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. ఐస్‌క్యూబ్, టూత్ పేస్ట్, నూనె రుద్దడం చేయరాదు.
- పర్యావరణానికి ఎలాంటి హాని చేయని గ్రీన్ కాకర్స్‌ను మాత్రమే కాల్చాలి.

అప్రమత్తంగా ఉండాలి

పటాకులు కాల్చే సమయంలో ప్రజలందరూ ఎంతో అప్రమత్తంగా ఉండాలి. దీపావళి రోజున తగిన జాగ్రత్తలతో పటాకులను కాల్చాలి. వీటిని విక్రయించే వారు విధిగా అనుమతులు తీసుకోవాలి. అనుమతులు ఉన్న మంచి పటాకులను కొనుగోలు చేసి కాల్చాలి. దుకాణాల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా వ్యాపారులు జాగ్రత్తలు వహించాలి. ఎక్కడ ప్రమాదం జరిగినా వెంటనే అప్రమత్తమై దగ్గరలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించాలి. -

కృష్ణంరాజు, సీఐ
హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్

వికారాబాద్‌లో భారీ వర్షం

వికారాబాద్‌లో కురుస్తున్న వర్షం

వికారాబాద్, అక్టోబర్ 30: పట్టణంలో బుధవారం సాయంత్రం దాదాపు రెండు గంటల పాటు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. వికారాబాద్ మున్సిపల్‌లో వర్షపు నీరు వెళ్లే కాల్వలు కబ్జాకు గురి కావడంతో వర్షపు నీరు రోడ్లపై పారింది. ఎన్నెపల్లిలోని ప్రధాన రోడ్డుపై వర్షపు నీరు నిలిచింది. బీజేఆర్ చౌరస్తాలో, రైల్వే స్టేషన్ ముందు, మహాశక్తి చౌరస్తా, ఫైర్ స్టేషన్ ఎదుట, అస్సాం బేకరీ రోడ్డు తదితర ప్రదేశాల్లో వర్షపు నీరు భారీగా చేరింది. రోడ్లపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. స్థానికులతో పాటు వివిధ పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రజలు వరద నీటితో పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మున్సిపల్ అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి వర్షపు నీరు వెళ్లేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయడంలో విఫలమయ్యారని పట్టణ ప్రజలు మండిపడుతున్నారు.

వికారాబాద్‌లో జలమయమైన రోడ్లు

దీపావళిని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రమిదలు, దేవతల విగ్రహాలను విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పండుగ సందడి నెలకొన్నది. భక్తులు వాటిని కొనుగోలు చేసేందుకు భారీగా తరలివచ్చారు.

– న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ అక్టోబర్ 30

డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్‌మెంట్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, బీబీఏ లాజిస్టిక్స్, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకామ్, బీకామ్ ఆనర్స్ తదితర కోర్సుల మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 19వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

డిగ్రీ పరీక్ష ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 30: ఓయూ పరిధిలోని డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ తదితర కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి వచ్చే నెల 4వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

ఆక్రమణదారులను తొలగించి.. అర్హులకు న్యాయం చేయండి

● అధికారులకు రెవెన్యూ మంత్రి పొంగులేటి ఆదేశాలు

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గంలోని నందనవనంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన ఇండ్లను అక్రమంగా ఆక్రమించుకున్నవారిని తక్షణమే ఖాళీ చేయించాలని రెవె న్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం మహేశ్వరం నియోజకవర్గంలోని మంకాల్, సందనవనంలో ఉన్న ఇండ్ల సమ స్య, కేటాయింపులపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాశ్, ప్రజా వాణి నోడల్ అధికారి డి.దివ్య, ప్రస్తుత రంగారెడ్డి కలెక్టర్ నారాయణ రెడ్డి, గతంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్లుగా విధులు నిర్వర్తించిన డాక్టర్ ఎస్. హరీశ్, కె.శశాంక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అక్రమంగా ప్రభుత్వ ఇండ్లను ఆక్రమించుకున్న వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కబ్జాదారుల నుంచి ఇల్లు విడిపించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

గతంలో తిరగబడ్డ పేదోళ్లు?

20 ఎకరాల్లో ఉండే నందనవనంలో ఖాళీ స్థలం అధికంగా ఉన్నది. ఇందులో కొంతమంది నిరుపేదలు గూడు నిర్మించుకుని ఉంటున్నారు. గతంలో వాళ్లను ఖాళీ చేయించాలని ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నించాయి. కానీ అక్కడి జనంలో పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. దీంతో నాటి సర్కార్ ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇప్పుడు రేవంత్ సర్కార్ కూడా అదే ప్రయత్నం చేయబోతుండటంతో పేదలు తీవ్రంగా వ్యతిరేకించే పరిస్థితులు ఉంటాయని అధికారులు చర్చించుకుంటున్నారు.

పర్యావరణహితంగా జరుపుకోండి: మేయర్

సిటీబ్యూరో, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : దీపావళిని పురస్కరించుకుని బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆర్థిక విభాగం ట్రెజరీలో నిర్వహించిన ప్రత్యేక పూజలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్, జీహెచ్ఎంసీ అధికారులు, ఉద్యోగులకు, కార్మికులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.